విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 23, మే 2024

మహిళలు ఎటువైపో..

- ఈ ఎన్నికల్లో గెలుపోటముల నిర్ణేతలు వారే
- మొత్తం ఓట్లు40,765
- పోలైనవి33,875
- పురుషుల ఓట్లు16,881
- మహిళల ఓట్లు16,994
- పోలింగ్ లోను వారిదే పై చేయి
- ఓట్లు మావే అంటే.... మావే అంటూ అంచనాల్లో ఇరు పార్టీలు

విశాలాంధ్ర -చాగలమర్రి : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగి వారం దాటింది. ఓటర్లను ఆకర్షించేందుకు ఇరు పార్టీల నాయకులు రకరకాల ప్రయత్నాలు చేశారు. చివరకు ఓటుకు నోటు ఇచ్చారు. చాగలమర్రి మండలంలో ఇరు పార్టీల నాయకులు రూ 1500 వరకు పంపిణీ చేసినట్లు సమాచారం. అయితే జగన్ ప్రభుత్వంపై అటు సొంత పార్టీలోనే కాదు సామాన్యుల్లో కూడా వ్యతిరేకంగా ఉన్నారనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కొత్త ఓటర్లు, మహిళా ఓటర్లు ఎటువైపు పడ్డారనే చర్చ నడుస్తోంది. తాము ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలను తీసుకున్న మహిళలందరూ వైసీపీకి గంప గుత్తగా ఓటేశారని తిరిగి తామే అధికారం చేపడ తామని ఆ పార్టీ వారు అంటున్నారు. ఇక జగన్ పాలనలో సామాన్యులకు మోసం చేశారని, కరెంట్ బిల్లు చెత్త పన్ను, వివిధ రకాల పన్నులతో జనాల్ని బాదేశారని పన్నులు బిల్లులు పెరగడంతో మహిళల్లో చాలా వ్యతిరేకత ఉందని అందుకే ఓట్లన్నీ తమకేనని టీడీపీ భావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో మండలంలోని మహిళా ఓట్ల పైనే ఇప్పటికే చర్చ నడుస్తోంది. జనం ఓటేసి వారం దాటిన

స్థానిక నాయకులు ఇంకా కాకి లెక్కల్లో బిజీగా ఉన్నారు. పోలింగ్ బూతుల వారిగా ఓటింగ్ నమోదు వివరాలు పూర్తిగా ఆయా వర్గాలకు చేరిపోయాయి. పోలైన ఓట్లలో కొత్త ఓటర్లు, మహిళలు, సాంప్రదాయ ఓటర్లు ఇలా అన్నింటిని క్రోడీకరించుకొని గెలుపు మాదే గెలుపు మాదే అంటూ ఆనంద పడుతున్నారు. మండలంలో ఉన్న ఓటర్లలో సగం మందికి పైగా మహిళలు ఉన్నారు. ఇప్పుడు ఓటింగ్‌లో కూడా పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. మహిళా ఓట్లు మావే అంటూ అటు వైసిపి ఇటు టిడిపి సంబరపడుతున్నాయి. జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే ఓటర్లు పోటెత్తారని మాదే గెలుపు అంటూ వైసీపీ అంటుంది. ఇక జగన్ పాలనలో తీవ్ర నష్టం జరిగిందని, ఉచిత వంటగ్యాస్ సిలిం దర్లు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంత మందికి అమ్మఒడి పథకం, రూ4 వేల పింఛన్, ఉద్యోగ అవకాశాలు తమకు లభిస్తాయని టీడీపీ అంటోంది. జగన్ రూపాయి ఇచ్చి పన్నుల ద్వారా మరో చేత్తో లాగేసుకుంటున్నారనే విమర్శ ఉంది. అందుకే ఇప్పుడు మహిళలు ఎటువైపు మొగ్గు చూపారనే చర్చ నడుస్తోంది.

404 మంది మహిళలుఅధికం : మండలంలో మొత్తం ఓటర్లు 40,765 ఉండగా ఓటేసింది మాత్రం 33875 మంది మాత్రమే. అందులో పురుషులు16881, మహిళలు 16994 ఓటేశారు. మహిళలే పురుషులకంటే అన్నింట ఆధిక్యం అని పోలింగ్‌లోను నిరూపించుకున్నారు. అధికంగా పోలైన మహిళల ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించనున్నాయి.

స్వామి వారి ఆలయాభివృద్ధికి సహకరిస్తా : శెట్టి విజయ్ కుమార్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: అహోబిలంలో జరుగుతున్న లక్ష్మి నరసింహ స్వామి వైశాఖమాస నృసింహ జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను రథంపై పుష్ప పల్లకిలో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారి పల్లకి సేవలో శెట్టి విజయకుమార్ పాల్గొన్నారు. బుధవారం ఎగువ అహోబిలంలో స్వామివారికి చక్రస్నానం, దిగువ అహోబిలంలో శ్రీ నరసింహ స్వామి జయంతి 108 కలశ తిరుమంజనం ఆలయ అర్చకులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, శ్రీకృష్ణదేవరాయ కాపు బలిజ నిత్య అన్నదాన సత్రం అధ్యక్షుడు, బలిజ సంఘం నేత శెట్టి విజయకుమార్,

సతీమణి లక్ష్మీదేవి, బద్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, టిడిపి ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గూడూరు సంజీవరాయుడు, అంగం శివ రాయల్ (జర్నలిస్ట్) తదితరులు నరసింహ స్వామి వారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శెట్టి విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వామి వారి పల్లకి సేవలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. స్వామి వారి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహాయ, సహకారం అందిస్తానని చెప్పారు. భక్తులందరూ స్వామి ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మనోజ్, సంతోష్, హరి, బండి రామచంద్రుడు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర వార్తకు విశేష స్పందన

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధి లోని గుంపుర మాను దీన్నే గ్రామంలో రహదారిపైనే చెత్తా చెదారం, అంటు వ్యాధులు ప్రభలే ప్రమాదం, అని 22న బుదవారం వెలువడిన విశాలాంధ్ర వార్తకు విశేష స్పందన లభించింది. మండల గ్రామ స్థాయి అధికారులు గుంపుర మానుదీన్నేకు చేరుకోని పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రహదారిపై ఉన్న దిబ్బలు చెత్తా చెదారం తొలగించాలని ఆదేశించారు. ఎంపీడీవో ప్రణి రాజ కుమారి, ఈవోపీఆర్డి నాగేంద్రుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి రవిశంకర్ శర్మ, ఇతర అధికారులు. గ్రామంలోని ఎస్సీ కాలనీ తో పాటు పలు వార్డులలో క్లోరినేషన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లించి దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి అధికారులు స్పందించేలా ప్రభావం చూపిన విశాలాంధ్రకు గ్రామ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర-అవుకు: పట్టణంలోని ఐటీఐ కళాశాలనందు ఈ నెల 27న సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఐటీఐ కళాశాలలో జరుగు జాబ్ మేళాకు 18 సంవత్సరాల పూర్తయిన పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్ మరియు డిగ్రీ చదివిన నిరుద్యోగయువతి, యువకులు హాజరు కావచ్చు అని అన్నారు. శిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కడప, హోండా కంపెనీ కోలార్, ప్రీమియర్ ఎనర్జీ అండ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, వేరియంట్ అప్లియన్సెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హైదరాబాద్, భగవతి ప్రోడక్ట్ లిమిటెడ్ హైదరాబాద్, రెన్యుజెస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని అన్నారు. 18 సంవత్సరాల పూర్తి అయిన పదవ తరగతి లేదా ఇంటర్ తో పాటు కంప్యూటర్ నాలెడ్జి కలిగిన మహిళా అభ్యర్థులకు కోలార్లో సెల్ఫోన్ అసెంబ్లీ యూనిట్ నందు ఉద్యోగాలు ఉన్నాయని అన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యేవారు విద్యార్హత సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, సెల్ఫ్ ఆధార్, కార్డు బ్యాంకు పాస్బుక్ జిరాక్స్, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరు కావాలని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఈ రోడ్డు అధ్వానం.. ప్రయాణం భయానకం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల పరిధిలోని కలుగొట్ల, పెద్ద కొప్పెర్ల గ్రామాల మధ్యన ఉన్న రహదారి అధ్వాన్నంగా తయారయింది. పెద్ద కొప్పెర్ల నుండి కలుగొట్ల గ్రామానికి వెళ్లాలంటే రహదారి సరిగా లేకపోవడంతో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలుగొట్ల గ్రామ సమీపంలో కుందూ నది ఉండడంతో నదిపై బ్రిడ్జి నిర్మించారు. కుందూ నది అవతలి వైపు రహదారిలో వాగులు ఉండడంతో రహదారి పూర్తి అధ్వాన్నంగా తయారయింది. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఏళ్లు గతిస్తున్న ఈ రహదారికి మోక్షం లభించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెలుగోడులో తీతీదే ధార్మిక కార్యక్రమాలు

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు పట్టణంలో ని అయ్యపురెడ్డి నగర్‌లో వెలసిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 21 తేదీ నుండి నుండి ఐదు రోజులపాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బళ్ళాని సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, ప్రతి రోజు స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు, శనివారం సుదర్శన మహా మృత్యుంజయ హెూమం, మహాబలి పూర్ణాహుతి, 108 కేజీల పులిహోరతో స్వామి వారికి తిరుప్పావడ సేవ, సాయంత్రం 5గంటలకు శ్రీనివాస కళ్యాణం, తదనంతరం భక్తులందరికీ మహా ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి కరపత్రాలను స్థానిక భక్త సమాజంతో కలిసి ఆవిష్కరించారు. మొదటి రోజు శ్రీమద్రామా యణంపై మద్దయ్య స్వామి ప్రవచించారు. ధర్మప్రచార మండలి సభ్యులు ఉదారపు రామ లింగేశ్వర రెడ్డి, భజన మండలి అధ్యక్షులు తెలుగు నాగలక్ష్మమ్మ, జ్యోత్స్న, సాలమ్మ, అంజనమ్మ, వెంకటేశ్వర్లు,రాజు, శివుడు, ఆంజనేయులు, భరత్, బి.రాము, నాగేశ్వరరావు, లక్ష్మీ నారాయణ, రమణయ్య, మురళీ కృష్ణ, నాగార్జున, సంజీవరాయుడు, యం. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అధికార పార్టీకి ఓట్లు వేయలేదని దాడికి పాల్పడిన

వైసీపీ నాయకునిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - నంద్యాల : గోస్పాడు మండలం పసురపాడు గ్రామము వైసీపీకి చెందిన ఆళ్లగడ్డ అమర లింగేశ్వర్ రెడ్డి గోస్పాడు సీపీఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి షేక్ జిలాని బాషపై పసురపాడు గ్రామంలో అధికార పార్టీకి ఓట్లు వేయలేదనే కక్షతో.. తాగి, నానా బూతులు తిడుతూ దాడికి పాల్పడడం దుర్మార్గమైన చర్య అని, వెంటనే అతనిపై చట్ట పరమైన తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, సీపీఐ గోస్పాడు మండల కార్యదర్శి జి.హరినాథ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం గోస్పాడు సీపీఐ మండల సమితి సమావేశం గోస్పాడు గ్రామంలో జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, గోస్పాడు మండల కార్యదర్శి జి హరినాథ్, మండల సహాయ కార్యదర్శి జిలాని బాష, ఏపీ ప్రజా నాట్య

మండలి జిల్లా నాయకులు గోకారి, సీపీఐ నాయకులు నరసింహులు, వెంకటేశ్వర్లు, నరసింహ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ గోస్పాడు మండలంలో పసురపాడు గ్రామ శివారులోని శ్రీరామ్ నగర్‌లో జరిగిన జాతరకు ఆ గ్రామ పెద్దలు ఆహ్వానం మేరకు సీపీఐ మండల సహాయ కార్యదర్శి జిలాని బాష భోజనానికి వెళ్లడం జరిగిందని, అక్కడే ఉన్న పసరుపాడు వైసిపి పార్టీ చెందిన నాయకుడు ఆళ్లగడ్డ అమర లింగేశ్వర్ రెడ్డి జిలానిభాష చొక్కా పట్టుకుని మా పార్టీకి ఓట్లు వేయకుండా ఇతర పార్టీలకు మద్దతు తెలుపుతారా కొడకల్లారా అంటూ రాయలేని విధంగా అమ్మనా బూతులు తిట్టి దాడికి పాల్పడగా అక్కడే ఉన్న నాయకులు కొంతమంది సీపీఐ నాయకున్ని ఇంటికి పంపడం జరిగిందన్నారు. ఈ విషయంపై స్థానిక గోస్పాడు పోలీస్ స్టేషన్లో రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని, వెంటనే స్థానిక పోలీస్ అధికారులు వైసీపీ నాయకుడు అమర లింగేశ్వరపై చట్టపరమైన చర్యలు చేపట్టకపోతే సీపీఐ రాష్ట్ర పార్టీ దృష్టికి, జిల్లా ఎస్పీ, రాష్ట్ర డీజీపీ, రాష్ట్ర ఎన్నికల అధికారికి దృష్టికి తీసుకుపోతామన్నారు.

నందికొట్కూరుకు మంచినీటిని అందించాలి : సీపీఐ

విశాలాంధ్ర - నందికొట్కూరు: ముచ్చుమర్రి నుండి నందికొట్కూరు మీదుగా ఓర్వకల్లు పరిశ్రమలకు పైపులైన్ ద్వారాశ్రీశైలం కృష్ణ బ్యాక్ వాటర్ ద్వారా తీసుకు వెళ్లడం జరుగుతుందని, దీని ద్వారా నందికొట్కూరు పట్టణానికి మంచినీటిని అందించాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు వడ్డే సుధాకర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీ ఏర్పాటు అయ్యి దాదాపు పది సంవత్సరాలు దాటిన పట్టణానికి మంచినీటి సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. మున్సిపాలిటీ జనాభా దాదాపు 70 వేలు ఉన్నప్పటికీ జనాభాగతగ్గట్టుగా ట్యాంకుల నిర్మాణం చేపట్టారే తప్ప వాటిలోకి నీటిని తరలించడంలో జాప్యం జరుగుతుందన్నారు. మల్యాల దగ్గర సమ్మర్ స్టోరేజ్ ఉన్నా ఆ నీరు ఏ మాత్రం పట్టనానికి సరిపోదం లేదని, గత రెండేళ్ల కిందట అలగనూరు రిజర్వాయర్ నుండి దాదాపు రూ.100 కోట్ల పైన ప్రభుత్వం నిధులు కేటాయించిందని, పనులు మొదలు పెట్టారని, అయితే సమ్మర్ స్టోరేజ్‌కి స్థలం ఇంతవరకు కేటాయించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముచ్చుమరి నుండి కృష్ణ బ్యాక్ వాటర్‌ను నందికొట్కూరు టౌన్ మీదుగా ఓర్వకల్లు పరిశ్రమల కొరకు తరలించడం జరుగుతుందన్నారు. అలగనూరు రిజర్వాయర్‌కు ఇచ్చిన నిధులను మళ్లించి ఓర్వకల్ పైపులైన్ ద్వారా ఒక లింకును ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమి జగనన్న కాలనీ

అనుకొని 12 ఎకరాల మిగిలిపోయిన భూమి ఉన్నదని ఆ భూమిలో సమ్మరి స్టోరేజ్ నిర్మాణం చేపట్టి ఆ నిధులను ఇక్కడికి మళ్ళించాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శ్రీరాములు ఉపేంద్ర భాస్కర్ గౌడ్ రామకృష్ణ చాంద్ బాష, మహేష్ రైతు మహిళా సంఘం నాయకురాలు మల్లేశ్వరమ్మ, గోవిందమ్మ, పద్మావతి, మల్లమ్మ, ఫాతిమా, శ్యామల, భానువి సోఫియాబి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో దూసుకుపోతున్న నంద్యాల ఖిద్మత్ సొసైటీ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల ఖిద్మత్ సొసైటి స్థాపించిన ఇరవై నెలల్లో వెయ్యి మందికి రూ. కోట్ల ఋణాలు ఇచ్చి ప్రగతి పథంలో దూసుకుని పోతుంది. ముల్లాన్ పేటలోని ఖిద్మత్ సొసైటి బీఎంసీ సమావేశం సొసైటి అధ్యక్షులు నవాజ్ ఖాన్ అధ్యక్షతన జరిగింది. జిల్లా బోర్డు కార్యదర్శి ఎస్.షబ్బీర్ హుసేన్, డైరెక్టర్లు అబ్దుల్ సమద్, హాఫీజ్ ముహమ్మద్ షోయబ్ జమాన్, పీవీ ముస్తఫా, బీఎంసీ కార్యదర్శి అబ్దుల్ నబీ (అబ్దుల్లా), సభ్యులు జమీలుద్దీన్, అబ్దుల్ అలీం, ఇలియాస్ మేనేజర్ ముహమ్మద్ ఫయాజ్, అకౌంటెంట్ నూరుల్ హఖ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రస్తుతం నంద్యాల సొసైటిలో పన్నెండు వందల మంది సభ్యులు ఉన్నారని, వడ్డీ రహిత ఋణాలతో పేద వ్యాపారులు సద్వినియోగం చేసుకుంటు న్నారన్నారు. హజ్, ఉమ్రా తదితర తీర్థ యాత్రలకు వెళ్ళు వారు ప్రత్యేక పర్సనల్ ఖాతాల ద్వార యాత్రలు చేయవచ్చన్నారు. హజ్ యాత్రకు వెళ్ళుతున్న సొసైటి కార్యదర్శి బిల్డర్ అబ్దుల్లాకు జమాఆతె ఇస్లామీ హింద్ నంద్యాల అధ్యక్షులు అబ్దుల్ సమద్ శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సొసైటి కార్యవర్గ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సమద్ మాట్లాడుతూ ముస్లింల జీవితంలో హజ్ పవిత్ర యాత్ర చాలా ముఖ్యమైన ఘట్టమని అబ్దుల్లాను అభినందిస్తు, ప్రపంచ మానవాళి కోసం, మన దేశం కోసం, నంద్యాల ప్రజల కోసం ప్రార్థించాలని సమద్ విన్నవించారు.

అధిక ధరకు అమ్మితే చర్యలు

విశాలాంధ్ర -ఆత్మకూరు టౌన్: విత్తనాలు అధిక ధరకుఅమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనే యులు, మండల వ్యవసాయాధికారి డి.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పట్టణంలో బుధవారం పలు విత్తన దుకాణాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలు అధిక ధరకుఅమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. రైతులు విత్తనాలు కొన్నపుడు తప్పనిసరిగా విత్తనాలు కొన్న రసీదు పొందవలెనని తెలపారు. విత్తనాలు డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించడం జరిగిందన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. వీరి వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ త్రవ్వకాలను అరికట్టండి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - నంద్యాల: జిల్లా వ్యాప్తంగా చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇసుక అక్రమ త్రవ్వకాలను అరికట్టేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్, కలెక్టర్ అధ్యక్షతన ఇసుక అక్రమ త్రవ్వకాలపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు గట్టి నిఘా ఉంచి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణా, త్రవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలని సబ్ డివిజనల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. దిగువ స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి అక్రమ ఇసుక రవాణా పై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తాసిల్దారులు రెవెన్యూ అధికారులు, పోలీస్ అధికారులచే ముమ్మర తనిఖీలు నిర్వహించి ఇసుక అక్రమ త్రవ్వకాలను నియంత్రించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని ఆ మేరకు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పర్మిట్ లేని ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను సీజ్ చేసేందుకు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని ఉప రవాణా అధికారిని కలెక్టర్ ఆదేశించారు. రాత్రి వేళల్లో కుందూ నదిలో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు అక్కడి పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఎంఫోర్స్మెంట్ బ్యూరో అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కేసీసీ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. జిల్లా గనులు , భూగర్భ శాస్త్ర అధికారి రామచంద్ర, ఉప రవాణా అధికారి శివారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి, భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు రఘురాం, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పెసర వాయి గ్రామంలో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర -గడివేముల: మండల పరిధిలోని పెసర వాయి గ్రామంలో బుధవారం పాణ్యం సీఐ నల్లప్ప, గడివేముల ఎస్సై బీటీ వెంకటసుబ్బయ్య పోలీసు సిబ్బందితో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు డిఎస్పి ఆధ్వర్యంలో పెసర వాయి గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామంలోని అనమానిత ఇండ్లలో సోదాలు నిర్వహించామన్నారు. శాంతిభద్రతల దృష్టా సమస్యాత్మక గ్రామాల్లో ఈ సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు.ఎన్నికల లెక్కింపును దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, అసాంఘీక కార్యక్రమాలకు చోటువివ్వకుండా ముందస్తుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎవ్వరైనా నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, ఎంతటివారైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. గ్రామంలో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలో తప్పవు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలతో, స్థానిక పోలీస్ అధికారులతో వారి సిబ్బందితో కలిసి నాలుగు రోడ్ల జంక్షన్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జూన్ 4వ తేదీన జరుగునున్న ఎన్నికల కౌంటింగ్ ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండేందుకు మరియు ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై, గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని, జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులు, వారి సంబంధించిన వ్యక్తులు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు చేయరాదన్నారు. రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా ఉంచడం జరిగిందని, గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి షేక్ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్ బాబు, హనుమంతు నాయక్, ఎస్సైలు షేక్ నగిన, వెంకటరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

అధిక రేట్లకు విక్రాయిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర- డోన్ : రైతులకు ఎరువులు, విత్తనాలు అధిక రెట్లకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక్ వర్ధన్ రెడ్డి ఎరు వుల షాపుల డీలర్లను హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు అశోక్ వర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ పట్టణంలో విత్తనాలు విక్రయించే షాపులు అయినటువంటి కిరణ్ హైబ్రిడ్ సీడ్స్,కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ షాపులను అకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, కంపెనీల వారీగా సర్టిఫికెట్లను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు విత్తనాలు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయించరాదని, రైతు అడిగిన రకాలనే సరఫరా చేయాలన్నారు. కల్తీ లేకుండా, నాణ్యమైన విత్తనాలను, బిల్లులు రైతులకు అందించాలని ఆదేశించారు. ఎవరైనా కల్తీ విత్తనాలు విక్రయించినట్లయితే వారిపైన కఠిన చర్యలతో పాటు పీ.డి ఆక్ట్ కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. పత్తి విత్తనాలు విక్రయించే షాపుల నందు హెచ్‌టి టెస్ట్ అనగా కలుపు నిరోధిక శక్తి కలిగిన జెనువు విత్తనాలలో ఉన్నది, లేనిది పరీక్ష చేశారు. అటువంటి జనువు లేదని పరీక్షలో లేదన్నారు.

ఎయిడ్స్ తీవ్రతను నిర్ధారించే యంత్రం ఏర్పాటు

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ నందు ఎఆర్‌టీ సెంటర్ ఏర్పాటు చేసి 12 ఏళ్లు అయినవి. ఇప్పుడు ఎయిడ్స్ వ్యాధి గ్రాస్థులకు వ్యాధి తీవ్రతను నిర్ధారించే అత్యాధునిక, అత్యంత ఖరీదైనా సిడి4 కౌంట్ యంత్రం ప్రప్రథమంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ, సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ శడాక్టర్ ప్రసాదరావు ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమానికి సర్వజన ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఎఆర్ టీ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొనడం జరిగింది. ఇదివరకు ఈ అత్యాధునిక, అత్యంత ఖరీదైన పరీక్షలు చేయుటకు కర్నూల్ సర్వజన ఆసుపత్రికి సాంపిల్స్ పంపడం జరిగేది. ఇప్పుడు నంద్యాల జిల్లాలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చినదని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శారదాబాయి తెలియజేసారు.

చౌడేశ్వరి అమ్మ వారికి దీపాలంకరణ

విశాలాంధ్ర -బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరి అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 6:30 ఆలయంలో అమ్మవారికి సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర -కొలిమిగుండ్ల : మండల కేంద్రానికి చెందిన ఎరుకలి శీలం ఆంజనేయులు (36) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల మేరకు ఆంజనేయులు ఈనెల 18న వైఎస్ఆర్ జిల్లా వేముల మండలం బొందిచర్లలోని బంధువుల ఇంటికి వెళ్ళగా అక్కడ పిడుగుపాటుతో మంచం మీద నుండి కిందపడి అతను తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం జిల్లా తాడపత్రి ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మరింత మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆంజనేయులు అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. అతనికి భార్య కుమార్తె కుమారుడు ఉన్నారు. అతని మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన బాలిక నిత్యం సెల్ఫోన్ చూస్తుండేది. అందులో భాగంగానే మంగళవారం ఉదయం ఆ బాలిక సెల్ఫోన్ చూస్తుండగా తల్లిదండ్రులు మందలించారు. దీంతో బాలిక మనస్థాపానికి గురై ఇంటి వద్ద నుండి వెళ్లిపోయింది. బాలిక ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికించారు చివరికి ఇంటికి తిరిగి రాకపోవడంతో బుధవారం కోవెలకుంట్ల పోలీస్ స్టేషన్లో బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

సీజన్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-నంద్యాల రూరల్: రాబోయే వర్షకాలన్నీ దృష్టిలో ఉంచుకొని ప్రజలు సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మండల వైద్య అధికారి డాక్టర్ షాహేలం అన్నారు. బుధవారం ఆయన స్థానిక వైద్యశాల నందు తన సిబ్బందితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ వ్యాధులైన మలేరియా, డెంగులాంటి విషపూరితమైన వ్యాధులపై తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇంటి చుట్టు ప్రాంతాలలో మురికి కాలువలు గుంటలు ఉన్నచోట దోమలు అభివృద్ధి చెందకుండా వాటి నివారణకు బ్లీచింగ్ పౌడర్, వేస్ట్ ఆయిల్ లాంటి వస్తువులతో శుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో పిచ్చి మొక్కలు పెరగకుండా,వ్యర్థమైన పదార్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఎప్పటికప్పుడు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

ఉపాధి కూలీలకు డబ్బుల కోత విధించడం సరైంది కాదు

విశాలాంధ్ర -హొళగుంద :మండలంలోని గజ్జేహళ్లి లో ఉపాధి కూలీలకు డబ్బుల కోత విధిస్తున్నారంటూ బుధవారం ఉపాధి కూలీలు ఆందోళన చేశారు. ఉపాధి పనుల్లో భాగంగా ఫారంఫండ్ తవ్వడానికి వెళితే సక్రమంగా కూలీ డబ్బులు బ్యాంకు అకౌంట్లో పడటం లేదంటూ ఆరోపించారు. వారం పని దినాలకు హాజరైతే కేవలం మూడు రోజుల పని దినాల వేతనాల డబ్బులు అకౌంట్లో జమవుతున్నాయని, మిగిలిన కూలీ డబ్బులు ఎక్కడకి వెళుతున్నాయని ఉపాధి కూలీలు వాపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని మాస్టర్ రోల్ సక్రమంగా వేయడం లేదని ఆరోపించారు. కూలీల హాజర్‌ని ఫీల్డ్ అసిస్టెంట్ తీసిపోకుండా ఇతరుల సహాయంతో హాజరు పట్టిక తీసుకుంటున్నాడన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కూలీ పనులకు పిలుచుకోకుండా సతాయిస్తున్నాడన్నారు. గ్రామంలో ఉపాధి పనుల కోసం దాదాపు 39 గ్రూపుల ద్వారా 600 మంది పనికి హాజరవుతున్నామని పేర్కొన్నారు. ఫారం ఫండ్ తవ్విన మట్టిని ఒకే చోట వేయకుండా రైతులతో ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మక్కై దూరంగా వేయిస్తున్నాడని దీని డబ్బు అదనంగా ఎవరు చెల్లిస్తారని అధికారులను ఉపాధి కూలీలు ప్రశ్నించారు. వేసవి ఎండలను లెక్కచేయకుండా సొంతవాహనాలకు సొంత ఖర్చులతో పెట్రోల్ వేయించుకుని దూర ప్రదేశాలకు వెళ్లి పని చేస్తున్నప్పటికీ ఉపాధి వేతనాలు డబ్బుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ కోతవిధిస్తున్నాడని ఆరోపించారు. రోజుకు రూ.300 కూలీ అందించాల్సిన అధికారులు కేవలం మూడు దినాలకే పరిమితం చేస్తున్నారని ఉపాధి కూలీలు పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడుతున్నాడని వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాల్లో ఎలాంటి కోత విధించలేదని కొలతల ప్రకారంగా కూలీలు చెల్లిస్తున్నామని, ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడినట్టు తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే సస్పెండ్ చేస్తామని అన్నారు. ప్రతి ఉపాధి కూలీకి రోజుకు 300 ప్రకారం గా క్యూబిక్ మీటర్ పని కల్పిస్తున్నామని అన్నారు. ఐదు రోజుల్లో పని చేసినప్పటికీ మూడు రోజుల వేతనాలు పడిన మిగిలిన రెండు రోజులు లెక్కల్లో ఉంటాయని అన్నారు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

ఆగి ఉన్న వృధా నీటిని తొలగించండి

విశాలాంధ్ర-పత్తికొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల దగ్గర ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారిలో ఆగి ఉన్న వృధా నీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతిరోజు వందలాదిమంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం ఈ మార్గం గుండా వస్తుంటారని, ఆసుపత్రికి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో గత నెల రోజుల నుండి త్రాగునీటి పైపు లీకేజై నీరు వృధాగా పారిపోతుంది. ఆపై అకాల వర్షాల వలన వర్షపు నీరు ఆగి మురుగు పేరుకు పోవడంతో వాహనదారులు,

పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగి ఉన్న మురుగు నీటిని తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆలూరులో గెలుపెవరిది..

- ఎన్నికల ఫలితాలపై సస్పెన్స్
- సర్వత్రా ఉత్కంఠ
- గెలుపుపై ఇరు పార్టీల ధీమా
- వరుసగా మూడోసారి గెలుస్తామంటున్న వైసీపీ
- మా గెలుపే ఖాయమంటున్న టీడీపీ



విశాలాంధ్ర - దేవనకొండ : ఆలూరు నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములపై రెండు పార్టీల శ్రేణుల్లో రోజు రోజుకూ ఉత్కంఠ పెరుగుతోంది. దాదాపు 82.77 శాతం పోలింగ్ నమోదు కావడంతో ఎవరికి వారు పోలింగ్ తమకే అనుకూలంగా ఉంటుందని వైసీపీ, టీడీపీ శ్రేణులు ఆశపడుతున్నాయి. టీడీపీ ఎన్ని వ్యూహాలు పన్నినా ఆలూరు నియోజకవర్గాన్ని జారిపోనివ్వమని భారీ మెజారిటీతో వరుసగా మూడోసారి వైసీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. జగన్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత, తమకు వరాలు అయ్యాయనే నమ్మకంతో టీడీపీ ఉంది. ఏళ్ల తర్వాత నియోజకవర్గంలో టీడీపీ విజయ పతాకం రెపరెపలాడడం కాయమని టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలో విజయం తమదంటే తమదంటూ వైసీపీ, టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గెలుపు పట్ల ఆ రెండు పార్టీల్లో విశ్వాసం తొణికిసలాడుతోంది. గెలుస్తామనే విషయంలో ఎవరి అంచనాలతో వారు ధీమాగా ఉన్నారు. కీలకమైన దేవనకొండ, ఆస్పరి మండలాలపైనే రెండు పార్టీలు గంపెడు ఆశలు పెట్టుకున్నాయి. రెండు పార్టీల నాయకులు తమ అంచనాలు విశ్లేషణలతో పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠను రేపుతున్నారు. దేవనకొండ, ఆస్పరి, ఆలూరు మండలాల్లో తమకే భారీ ఆధిక్యత లభిస్తుందని వైసీపీ ఎక్కువగా ఆశలు పెంచుకుంది. టీడీపీ పట్టున్న మండలంలో సైతం ఆ పార్టీ ఊహిస్తున్న స్థాయిలో మెజార్టీ రాదని వైసీపీ అంచనా వేస్తుంది. టీడీపీ ఆశిస్తున్న మెజార్టీ రాదని భావిస్తున్నారు. 2014 ఎన్నికల్లో వైసీపీ గుమ్మనూరు జయరాం 1919 ఓట్ల మెజార్టీ, 2019 ఎన్నికల్లో 39,896 వేలకు పైగా వైసీపీ ఓట్లు మెజార్టీ రాగా ఇప్పుడు ఆ మెజార్టీని అధిగమిస్తామని వైసీపీ నాయకులు భావిస్తున్నారు. మెజార్టీ ఖాయమంటున్నారు. అందుకోసం భారీ మొత్తంలో డబ్బు కూడా ఖర్చు పెట్టారని జనాలు, నాయకులు లోలోపల గుసగుసలాడుతున్నారు. నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో టీడీపీకి పట్టున్నప్పటికి అంతకు మించిన దీటైన గ్రామాలు తమకు కూడా ఉన్నాయని వైసీపీ నాయకులు చెబుతున్నారు. ఆలూరు నియోజకవర్గంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తమకే మెజార్టీ వస్తుందని, వైసీపీ ధీమాతో ఉంది. టీడీపీ ఎన్ని వ్యూహాలు పన్నినా నియోజక వర్గాన్ని జారి పోనివ్వమని భారీ మెజార్టీతో వరుసగా మూడో సారి వైసీపీ విజయం పతాకం ఎగరవేయడం ఖాయమని శ్రేణులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

ఆలూరు టీడీపీ కైవసం కావడం ఖాయం : వైసీపీ ఆశలు అలా ఉంటే టీడీపీ నేతల అంచనాలు, ధీమా అందుకు రివర్స్‌గా ఉన్నాయి. వైసీపీ నాయకులు ఎన్ని కబుర్లు

చెప్పినా, ఎంత మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా ఈసారి ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ ఓటమి తథ్యమని, టీడీపీ ధీమా వ్యక్తం చేస్తుంది. ఆలూరు, ఆస్పరి, దేవనకొండ మండలాల్లో టీడీపీ బలం ఏమాత్రం చెక్కుచెదరలేదని, దానికితోడు వైసీపీకి చెందిన బలమైన నాయకులు అనేకమంది టీడీపీలో చేరడం తమకు అదనపు బలమని అంటున్నారు. 2014, 2019నాటి పరిస్థితులు వేరని, ఇప్పుడు ఆ పరిస్థితి రివర్స్ అయిందని టీడీపీ నాయకులూ విశ్లేషిస్తున్నారు. వైసీపీకి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆగ్రహంతో ఆ పార్టీ గుడ్‌బై చెప్పారని చెబుతున్నారు. వైసీపీ నాయకులు ఎంతగా రెచ్చగొట్టాలని చూసినా నియోజక వర్గం మొత్తంలో వారి వ్యూహం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. టీడీపీ నుంచి కొద్ది మంది నాయకులు జారుకున్నా ఇతర సామాజిక వర్గాల నుంచి అంతకుమించిన స్థాయిలో నాయకులు టీడీపీకి మద్దతు పలికారని గుర్తు చేస్తున్నారు. మండలాల్లో వైసీపీ ఆశలు అడియాశలు అవుతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేవనకొండ, ఆస్పరి మండలాల్లో వైసీపీకి చావు దెబ్బ తగులుతుందని టీడీపీ నాయకులు గట్టి నమ్మకంతో ఉన్నారు. వైసీపీకి పట్టున్న కొన్ని గ్రామాల్లో కూడా పరిస్థితులు తారుమారు అయ్యాయన్న నమ్మకం టీడీపీ శ్రేణుల్లో బలంగా ఉంది. వైసీపీకి షాక్ కలిగించే అనూహ్య ఫలితాలు వెల్లడి కావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ భారీ మెజార్టీ వస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనపై ఉద్యోగులలో పెల్లుబికిన ఆగ్రహం ఓట్ల రూపంలో తమకు కలిసి వస్తుందని, దానికి తోడు జనసేన, బీజేపీ మద్దతు టీడీపీ విజయానికి ఎంతగానో కలిసొచ్చిందని టీడీపీ నేతలు అంటున్నారు. నియోజకవర్గంలో కీలకమైన తదితర సామాజిక వర్గాలు టీడీపీకి అండగా నిలబడ్డాయని చెబుతున్నారు. ఏళ్ల తరువాత ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ విజయ పతాకం రెపరెపలాడబోతున్నదని. వైసీపీ కంచుకోటను కైవసం చేసుకోవడం ఖాయమని ఆ పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఆలూరులో వీరభద్ర గౌడు గెలుపుపట్ల ఆ పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరుపార్టీల అంచనాలలో ఏది నిజమవుతుందో అన్నది వేచి చూడాల్సిందే మరి.

25న జిల్లా రగ్బీ జూనియర్ జట్ల ఎంపిక

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ఈనెల 25వ తేదీన ఉదయం 9 గంటలకు స్థానిక బి .క్యాంపు క్రీడా మైదానంలో జూనియర్ బాల బాలికల అండర్ -18 రగ్బీ జిల్లా జట్లకు క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం అధ్యక్షులు గుడిపల్లి సురేందర్, కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు.ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, 31 తేదీల్లో విశాఖపట్నం జిల్లా తిమ్మాపురం (భీమిలి) లో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల ఛాంపియన్షిప్ లో పాల్గొంటారని వారు తెలిపారు. 2006-09 సంవత్సరాల్లో జన్మించిన వారు ఎంపికకు అర్హులని వారు తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు వయస్సు ధృవీకరణ పత్రంతో 25వ తేదీ ఉదయం 10 రూపాయల దరఖాస్తు రుసుము చెల్లించి నేరుగా ఎంపికలో పాల్గొనవచ్చని తెలిపారు.

మంత్రాలయం పీఠంపై టీడీపీ జెండా

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మంత్రాలయం పీఠంపై టీడీపీ జెండా ఎగురడం ఖాయమని టీడీపీ బీసీ సెల్ నాయకులు ఎం.జి.నరసన్న ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పెద్ద కడబూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మంత్రాలయం నియోజక వర్గంలో మొదటిసారి బీసీ ముద్దు బిడ్డ రాఘవేంద్రరెడ్డి ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో విజయం సాధిస్తారని జోష్యం చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్‌కి ప్రజలందరూ మద్దతు ఇచ్చారని తెలిపారు. జూన్ 4 జరిగే ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో టీడీపీ, మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి 30 వేల మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

జూనియర్ న్యాయవాది అనారోగ్యంతో మృతి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా బార్ అసోసియేషన్ మధుసూదన్ రెడ్డి (36) అనా రోగ్యంతో మృతి చెందారు. అతని సొంత గ్రామం గోరంట్ల కాగా కర్నూలులో బార్ అసోసియేషన్ ప్రాక్టీస్‌గా చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. సీనియర్ న్యాయవాది నాగలక్ష్మి దేవి ఆఫీసులో ప్రాక్టీస్ చేసేవారు. బుధవారం ఉదయం 5 గంటల సమయంలో అనారోగ్యంతో బాధపడుతూ మధుసూదన్ రెడ్డి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ మృతి చెందిన న్యాయవాది మధుసూదన్ రెడ్డి మృతదేహాన్ని పరామర్శించి, నివాళులర్పించారు.

కరువు సహాయక చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - దేవనకొండ : గత ఖరీఫ్, రబీ సీజన్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తీవ్ర కరువు నెలకొని రైతాంగానికి తీవ్ర నష్టాన్ని చూపిందని, ఈ నేపథ్యంలోనే మండలంలోని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ మేరకు మండలాన్ని కరువు ప్రకటించి పరిహారం అందజేస్తున్నారని, మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్ లు డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువులు దుకాణాలపై తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రాముడు, నాగన్న, వీరంజి పాల్గొన్నారు.

సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి నిర్వహిస్తామని ఆర్ఐఓ గురువయ్య శెట్టి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి ఇంటర్మీడియట్ పరీక్షకు 15981, రెండో సంవత్సరానికి 6962 విద్యార్థి విద్యార్థులు హాజరవుతున్నారు అన్నారు. మొదటి ఇంటర్మీడియట్ పరీక్షకు 35 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. రెండవ ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు 22 ఏర్పాటు చేశామన్నారు. మొదటి ఇంటర్మీడియట్ పరీక్షలు 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని రెండవ ఇంటర్మీడియట్ సంవత్సరం రెండున్నర నుంచి ఐదున్నర గంటల వరకు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.మాస్ కాఫీ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. ఎక్కడైనా మాస్ కాఫీ జరుగుతే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

24న డీసెట్ పరీక్షలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లాలో డీసెట్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఈనెల 24న ఉదయం 10 గంటలనుండి 12.30 వరకు ఐఎన్‌వో డిజిటల్ జోన్ ఐడీజె నందు పరీక్ష జరుగుతుందని, ఈ పరీక్షకులను కర్నూలు జిల్లా నుండి 825 మంది ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తమ హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకొని సంబంధించిన పరీక్ష కేంద్రమునకు ఉదయం 8 గంటలకు చేరుకోవాలని డీఈవో సామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు లేటుగా వస్తే అనుమతించబడదన్నారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్‌రూంలో భద్ర పరచాలి : తిక్కారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను జిల్లాకేంద్రంలోని స్ట్రాంగ్‌రూంలలో ప్రత్యేకం గా భద్ర పరచాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు పీ తిక్కారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంక టేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వర రావుయాదవ్‌తో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా లోని కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను ఆయా నియోజకవర్గాల కేంద్రంలోని సబ్‌ట్రెజరీలో భద్ర పరచారని తెలిపారు. అక్కడ సరైన భద్రత లేదనే అనుమానాలు ఉన్నాయన్నారు. వెంటనే వాటిని ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థుల సమక్షంలో జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్ర పరచిన చోటనే ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్‌లను ఒక గదిలో భద్ర పరచాలని డిమాండ్ చేశారు. స్వల్ప ఓట్ల తేడాతో గెలిచిన సందర్భాలు కూడా ఉన్నాయని పోస్టల్ ఓట్లు కీలకంగా మారే అవకాశం లేకపోలేదన్నారు.రాష్ట్రంలో వైసీపీ వారి అరాచకాలను అడ్డులేకుండా పోతుందని పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లను ఏమైనా చేయవచ్చనే అనుమానాలు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేనా, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని పలు సర్వే సంస్థలు చెపుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వైసీపీ నేతలు ఏమైనా చేస్తారనే అపోహలు ఉన్నాయని అభ్యర్థులు, కార్యకర్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఓటమి భయంతో వైసీపీ వారు ఏమైనా చేయడానికి వెనుకాడరనే అనుమానాలు ఉన్నాయని వెంటనే వాటిని జిల్లా కేంద్రానికి తరలించాలని కోరుతున్నామని ఈ విషయంపై ఇప్పటికే జేసీ నారపురెడ్డి మౌర్యకు వినతిపత్రం అందచేయడమే కాకుండా, జిల్లా ఎన్నికల అధికారి సృజన దృష్టికి తీసుకుపోయామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు నాగరాజుయాదవ్, ముంతాజ్,రవికుమార్, జేమ్స్, సత్రం రామకృష్ణ, శెక్షావలి, రామాంజనేయులు, రవి, టి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల చివరి నాటికి కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఈ నెల 30వ నాటికి కౌంటింగ్ ఏజెంట్ల పేర్లు ఇవ్వాలని 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కర్నూలు నగర పాలక కమిషనర్ ఎ.భార్గవ్ తేజ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బుధవారం కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్ నందు 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కౌంటింగ్ నిర్వహణపై కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి పోటీ చేసిన అభ్యర్థులు, వారి అధికారిక ప్రతినిధులతో ఎ.భార్గవ్ తేజ సమావేశం నిర్వహించారు. ఈ నెల 30 వ తేదీ లోపు ఫారం 18 ని ఉపయోగించి అభ్యర్థులు రిటర్నింగ్ అధికారి గారి ద్వారా తమ కౌంటింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ లో భాగంగా 14 టేబుళ్లు ఈవీఎం ఓట్ల లెక్కింపునకు, 4 టేబుళ్లు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి అభ్యర్థి ప్రతి టేబుల్ కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ను నియమించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న ఏజెంట్లకు ఫోటో గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగు తుందని, కౌంటింగ్ హాల్ లోపలికి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, కౌంటింగ్ ఏజెంట్ వెరిఫికేషన్ సెంటర్ వద్ద తమ మొబైల్ ఫోన్లను జమ చేయవలసి ఉంటుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభానికి ఒక గంట ముందుగా కౌంటింగ్ సెంటర్ చేరుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనింగ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు అసెంబ్లీ నియోజక వర్గ ఏఆర్వో మోహన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ : ప్రకృతి వ్యవసాయ పద్ధతులోని మోడల్స్ ఏటీఎం, డాట్ ప్రూఫ్, పీఎండీఎస్, పలు పంటలు, అంతరపంటలు, కిచెన్ గార్డెన్స్ వంటి మోడల్స్ వేసి ఆరోగ్యకరమైన పంటలు, అధిక దిగుబడులతో పాటు నిరంతరాదయం పొందవచ్చు అని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యస్. చంద్రశేఖర్ కన్సల్టెంట్ రాజేశ్వర్ తెలిపారు. కప్పట్రాళ్ల గ్రామ రైతు మల్లికార్జున పొలంలో డాట్ ప్రూఫ్ మోడల్స్ వేయడం జరిగిందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కర్నూలు జిల్లా డీపీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పాటించి పండించిన ఆహారం తినడం వల్ల ప్రజలు రోగాల బారిన పడకుండా, దీర్ఘకాలంలో పర్యావరణం దెబ్బతినకుండా భవతరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్దతులు పాటించి పండించిన పంటలకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందని అన్నారు. రసాయనాలు వాడి పండించినటువంటి ఆహారం తిన్న నేలతల్లి బిడ్డలమైన మన ఆరోగ్యం కూడా అంతకంతకు క్షీణిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్స్, మల్లికార్జున, భుజేశ్వరుడు, ఎం.టి.సుధాకర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పలు ఇళ్లలో పోలీసుల తనిఖీ

విశాలాంధ్ర -గోనెగండ్ల: ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ రామకృష్ణయ్య అన్నారు. బుధవారం గోనెగండ్ల మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు ఎస్డిపిఓ సహకారంతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు.ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనుమానితుల ఇళ్లను సోదా చేశామని అల్లర్లు జరగకుండా ముందస్తుగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించి హెచ్చరికలు జారీ చేశామని అన్నారు.ఎన్నికల ఫలితాలు ముగిసిన తర్వాత గ్రామంలో గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు గోనెగండ్లకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగంగా కులం పేరుతో దూషణ

విశాలాంధ్ర -ఆస్పరి : ప్రభుత్వం నిర్వహిస్తున్న వైన్ షాపులో క్వాటర్ మందు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకపోవడంతో డబ్బులు అడిగిన వైన్ షాప్ సిబ్బందిని బహిరంగంగా కులం పేరుతో దూషించి, అవమానించిన బోయ మహేష్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ముందడుగు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు యం.చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు చిగళి నెట్టేకల్లు డిమాండ్ చేశారు. సోమవారం బహిరంగంగా కులం పేరుతో దూషించి, జాతిని అవమానపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ హనుమంతప్పకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పరికి చెందిన బోయ మహేష్ సోమవారం సాయంత్రం స్థానిక వైన్ షాపు దగ్గర కోటర్ మందును కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకపోవడంతో డబ్బులు అడిగిన దళిత సిబ్బందిపై దురుసుగా మాట్లాడి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అంతటితో ఆగకుండా వైన్‌షాప్ ముందు గుత్తి, ఆదోని ప్రధాన రహదారిలో ఎప్పటికైనా మా కాళ్ళ కింద బతకాలసిందే అంటూ కులం పేరుతో దూషిస్తూ, కేకలు వేస్తూ నానా హంగామా చేశారని ఆరోపించారు. జరిగిన ఘటనను పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బోయ మహేష్ పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హనుమంతప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర -ఆదోని రూరల్: మండలంలోని అలసంధాగుత్తి గ్రామంలో రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇస్వి ఎస్సై శ్రీనివాసులు, పెద్ద తుంబలం ఎస్సై చిన్న పీరయ్య, తాలూకా ఎస్సై ఎర్రి స్వామి సిబ్బందితో కలిసి బుధవారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా శాంతిభద్రతకు ఎవ్వరైనా విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో నాటు సారా కర్ణాటక లిక్కర్ అమ్మే వారి ఇండ్లను తనిఖీలు చేసి హెచ్చరించారు. గ్రామంలో ప్రధాన రహదారులు ముఖ్యమైన రచ్చకట్ట ప్రదేశాల్లో గ్రామ ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. 2024 సాధారణ ఎన్నికల ఫలితాల అనంతరం ఎవ్వరు కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని, లేనియెడల చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. చట్టానికి విరుద్ధంగా అమ్మకాలు జరిపినట్లు తమ దృష్టికి తెలిస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

సెమిస్టర్ 2,4, పరీక్ష ఫలితాలు విడుదల

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాయలసీమ యూనివర్సిటీ సెమిస్టర్ 2,4, పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్టు రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ కుమార్ ఒక ప్రకటన తెలిపారు. రెండో సెమిస్టర్‌లో 2178 విద్యార్థి విద్యార్థులు పాస్ అయినట్లు తెలిపారు. నాలుగో సెమిస్టర్ 7494 విద్యార్థి విద్యార్థులు పాస్ అయినట్లు ఆయన వెల్లడించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర- జిల్లా పరిషత్ : జిల్లాలోని విత్తన దుకాణదారులు డీలర్లు ఎవరైనాను రైతులకు విత్తనాలను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే, అలాంటి వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాలోని వ్యవసాయ అధికారులను ఓ ప్రకటనలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. విత్తన దుకాణదారులు స్టాక్‌బుక్ రికార్డులో చూపించిన విధంగా గ్రౌండ్ స్టాక్ ఉండాలని, అదనపు నిల్వలు ఉన్న సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేకుండా విక్రయించిన విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు.

శాంతి భద్రతలకు విఘతం కలిగిస్తే చర్యలు

విశాలాంధ్ర -వెల్దుర్తి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అనేక గ్రామాలలో పట్టణాలలో శాంతి భద్రతలు వివాదం కలిగించే సంఘటనలు జరిగిన సందర్భంగా రాష్ట్ర డిజిపి, జిల్లా ఎస్పీ, ఆదేశాల మేరకు మండల పరిధిలోని కలుగొట్లగ్రామంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్ రెడ్డిలు,గ్రామంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో వివిధ పార్టీల నాయకులను గ్రామ ప్రజలను, మీటింగ్ ఏర్పాటు చేసిఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గొడవలకు పాల్పడవద్దని తెలిపారు. గ్రామంలో ప్రజలు పోలీస్ శాఖ సూచనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలనిఅన్నారు.

నాటు సారా స్థావరాలపై దాడులు

విశాలాంధ్ర - కోడుమూరు : కోడు మూరు సెబ్ కార్యా లయ పరిధిలోని ఎల్ బండ గ్రామ సరిహ ద్దులలోని అటవీ ప్రాంతంలో నాటు సారా స్థావరాలపై దాడులు చేసి సారాబట్టిలు ధ్వంసం చేసిన్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఎల్.బండ తండా గ్రామ పరిధిలో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు చేయగా, సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లము ఊటను గుర్తించినట్లు చెప్పారు. సుమారు 750 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.కేసు నమోదు చేసి విచారిస్తునట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది వెంకట్ నాయక్, గోపాల్ నాయక్, విరుపాక్షి రెడ్డి పాల్గొన్నారు.

హెబ్బటంలో మహిళా ఆత్మహత్య..?

విశాలాంధ్రు-హొళగుంద: హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని హెబ్బటంలో బుధవారం వివాహిత మహిళ ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిందని ప్రజలు అనుమానిస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండగా, మృతురాలి భర్త, సోదరులు బెంగళూరుకు ఉపాధి కోసం వలస వెళ్లారు. మహిళ అనారోగ్యంగా ఉండడంతో గ్రామంలోనే విడిచి భర్త బెంగళూరుకు వెళ్ళొస్తా వెళ్ళిపోయారు. అయితే ఇంట్లో ఎవరు లేని సమయంలో మహిళ ఉరివేసుకొని మృతి చెందింది మహిళా ఆత్మహత్య పట్ల హె బ్బటంలో విషాదఛాయలు అలముకున్నాయి. తల్లి మృతితో పిల్లలు అనాధలుగా మారారు. ఎస్సై పెద్దయ్య నాయుడును సంప్రదించగ వివాహిత మహిళ ఉరి వేసుకుని మరణించింది నిజమని, భర్త బెంగళూరులో ఉన్నందున ఫిర్యాదించడానికి ఎవరు ముందుకు రాలేదన్నారు. మృతురాలి బంధువులు ఫిర్యాదిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు

విశాలాంధ్ర -వెల్దుర్తి: ఖరీఫ్ సీజన్‌కు రైతులకు డీలర్స్ నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని పత్తికొండ వ్యవసాయ శాఖ అధికారి ఏడీఏ విజయ్ మోహన్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా తెలిపారు. బుధవారం పట్టణంలో మన గ్రోమోర్, బాలాజీ సీడ్స్, ధరణి పెస్టిసైడ్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.రికార్డింగ్ తనిఖీ చేశారు. స్టాకును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలనేరైతులకు విక్రయించాలన్నారు. నకిలీ విత్తనాలువిక్రయిస్తే కఠినమైన చర్యలు ఉంటాయన్నారు రైతులు విత్తనాలు కొనేషాపు నుండి తప్పనిసరిగా రసీదునుపొందాలన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 23, మే 2024

ఫామ్-18లో ఏజెంట్ల వివరాలివ్వండి

విశాలాంధ్ర - నంద్యాల : పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు రాజకీయ పార్టీ ప్రతినిధులతో అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చేనెల 4వ తేదీ తొలుత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమైన అరగంట అనంతరం ఈవియంల కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లు ఉంటాయన్నారు. పోస్టల్ బ్యాట్ లెక్కింపులోనే భాగంగా మూడు టేబుల్ లను సర్వీస్ ఓటర్లకు ప్రత్యేకంగా కేటాయిస్తున్న కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల పాసుల జారీకి సంబంధించి ఈనెల 27వ తేదీలోగా కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను ఫామ్-18 ఇవ్వాలని కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులను సూచించారు. ఒక్కొక్క పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్ వద్ద లో ఒక సహాయ రిటర్నింగ్ అధికారిని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు మొబైల్ ఫోన్లను కౌంటింగ్ కేంద్రాలలోకి అనుమతించమన్నారు. జూన్ 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని నలుగురుకు మించి వ్యక్తులు ఎవరు గుమికూడి ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎలాంటి ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎ.పద్మజ, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

- ఆందోళన చెందుతున్న వినియోగదారులు
- అటకెక్కిన అల్లం
- ఘాటైన పచ్చిమిర్చి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: రోజు రోజుకు నిత్యావసర సరుకులు ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో పేద మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో అల్లం ధరలు ఒక్కసారిగా పెరగగా, పచ్చిమిర్చి ధరలు ఘాటును తలపిస్తున్నాయి. మార్చి నెల వరకు అల్లంధర కేజీ రూ.80 నుండి రూ.120 ఉండగా నేడు అల్లం కిలో రూ.250పైగా అమ్ముతున్నారు. ఇక పచ్చిమిర్చి ధర కేజీ రూ.40 నుంచి సెంచరీ దాటింది. వంకాయలు కేజీ రూ.40 నుంచి రూ.60, క్యారెట్లు రూ.60 నుంచి రూ.90, బీరకాయలు రూ.40 నుంచి రూ.60, బెండకాయలు రూ.30 నుంచి రూ.50, కాకరకాయలు రూ.80, కొత్తిమీర కట్ట రూ.50లు ఉండడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే పచ్చిమిరపకాయలు రేటు పెరగడంతో పచ్చిమిర్చి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు పచ్చిమిర్చి పండించిన రైతన్నలకు దళారులు మధ్యలోనే రేటు తగ్గించి గుండు గుత్తగా విక్రయాలు జరిపి కూరగాయల మార్కెట్లలో అమాంతం రేటు పెంచి వినియోగదారుల జేబులకు చిల్లులు వేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో దళారులను నిలువరించి ధరలను అదుపు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా పెరిగిన కూరగాయల ధరలు మాత్రం సామాన్యుడికి కంటనీరు తెప్పిస్తున్నాయి. సామాన్యుడికి అందు బాటులోలేని చికెన్, మటన్ ధరలు: మాంసం కొనడం సంగతి అటుంచి ధరలు వినాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. మటన్ ధర మార్కెట్లో రూ.700 నుండి రూ.750 రూపాయల పైగా ఉంది. అదే విధంగా చికెన్ గతంలో కిలో రూ.180 నుంచి 200 ఉండగా నేడు రూ. 280 రూపాయల వరకు ఉండడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. చేపలు కూడా గతంలో కేజి. 150 రూపాయలకు వచ్చేవి. నేడు చేపల రకాలను బట్టి రూ.250 నుంచి రూ. 450 వరకు ధర పలుకుతున్నాయి. ముక్క లేనిదే ముద్ద దిగని వారి పరిస్థితి ఇంకా చెప్పాల్సిన అవసరం లేదు. మటన్ వ్యాపారసులు ఆళ్లగడ్డలో రోడ్డుకు ఇరుపక్కల దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరికి ఆళ్లగడ్డలో ప్రత్యేకంగా మటన్ మార్కెట్ ఉన్న కొంతమంది మాత్రమే విక్రయాలు జరుపుతు న్నారు. అనేకమంది మటన్ మార్కెట్‌లో వ్యాపా రస్తులు విక్రయాలు జరపకుండా నిబంధ నలకు విరుద్ధంగా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు నిర్వహించి దుమ్ము, దూళి మధ్య పరిశుభ్రత లేకుండా మూగజీవాలను కోసి మాంసాన్ని విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల పైన మాంస విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి వేడుకలు

విశాలాంధ్ర- ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు మండల పరిధిలోని నల్ల కాల్వ గ్రామ శివారులో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి సందర్భం గా స్వామివారికి పంచ సూక్తములతో పంచామృతా లతో అభిషేకము విశేష అలంకరణ కుంకుమార్చనలు కళ్యాణోత్సవము పల్లకి సేవ, ఊంజాల్ సేవలు జరపడం జరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు అల్పాహార సదుపాయం కల్పించడం జరిగింది.

కోళ్ల బావాపురంలో పోలీసు కార్డాన్ సెర్చ్

విశాలాంధ్ర- నందికొట్కూరు : మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్టుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నంది కొట్కూరు రూలర్ సీఐ విజయభాస్కర్ పర్యవేక్షణలో ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం సుమారు 30 మంది పోలీసులతో కొల్ల బాపురం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 06 మోటార్ సైకిళ్ళు 40 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. నందికొట్కూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండి శాంతియుతంగా మెలగాలని జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ పోలీసు కార్డాన్ సెర్చ్ నిర్వహించడం జరిగిందని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిడ్తూరు ఎస్సై జగన్మోహన్ యాదవ్, ముచ్చుమర్రి ఎస్సై జయ శేఖర్, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో కార్డెన్ సర్చ్

విశాలాంధ్ర - బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని తెలుగు పేట, రాంభూపాల్ నగర్ నందు బనగానపల్లె పట్టణ సీఐ గంటా సుబ్బా రావు సమక్షంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇల్లు సోదాలు చేశారు. అందులో ఎలాంటి పత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. 20 లీటర్ల నాటు సారాయిని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె రూరల్ సీఐ తిమ్మారెడ్డి, పట్టణ ఎస్సై రామిరెడ్డి, అవుకు ఎస్సై కిరణ్, నందివర్గం ఎస్సై తిరుపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తోక్కుతున్న విద్యా సంస్థలను సీజ్ చేయాలి

విశాలాంధ్ర -ఆత్మకూర్ రూరల్ : టీచర్లతో మండుటెండల్లో వీధి, వీధి అడ్మిషన్ల కోసం క్యాంపెనింగ్ చేయిస్తున్న పుల్లారెడ్డి, గౌతమ్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి ఐస జిల్లా కార్యదర్శి యస్.నాగార్జున డిమాండ్ ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల అక్రమ అడ్మిషన్లు అడ్డుకోవాలని టీచర్లతో అడ్మిషన్ల కోసం ప్రచారం చేయిస్తున్న పుల్లారెడ్డి, గౌతమ్ స్కూళ్ళపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఎంఈఓ 2 సురేష్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐస జిల్లా కార్యదర్శి యస్.నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు టీచర్లతో అడ్మిషన్ల కోసం క్యాంపెనింగ్ చేయించకూడదని నిబంధనలు ఉన్న ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ.. పుల్లారెడ్డి,గౌతమ్ స్కూల్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా ఆత్మకూరు నగరంలో ప్రైవేట్ టీచర్లను అడ్మిషన్ల కోసం క్యాంపెనింగ్ పేరుతో ఈ మండుటెండల్లో వీధి,వీధి తిప్పుతూ టిచర్లను ఇబ్బందులు గురిచేస్తున్నారు. అంతే కాకుండా రంగురంగుల కరపత్రాలు, పెద్ద,పెద్ద బ్యానర్లు ద్వారా విద్యార్థుల ర్యాంకుల ప్రచారం చేసుకుంటూ, లేనిపోని మాయమాటలు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. రేకుల షెడ్లలో తరగతులను నిర్వహిస్తూ గ్రౌండ్ కూడా లేకుండా పాఠశాల నిర్వహిస్తు వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారు. కావున మండల విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తు వదిలి పుల్లారెడ్డి,గౌతమ్ స్కూళ్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.లేకపోతే ఐస ఆధ్వర్యంలో ఉద్యమాలకు పూనుకుంటాం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసా నియోజకవర్గం అధ్యక్షుడు వర్ధన్,టౌన్ నాయకులు రాజు పాల్గొన్నారు.

మహిళల మృతికి కారణమైన నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ : నగర శివారులో ఇటీవల మహిళల మృతికి కారణమైన నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు రేంజ్ డీఐజీ విజయ రావ్, కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్‌ల ఆదేశాల మేరకు కర్నూలు అడిషనల్ ఎస్పీ నాగరాజు, కర్నూలు డిఎస్పీ విజయశేఖర్, సిబ్బందిని 3 బృందాలుగా అహర్నిశలు కృషి చేసి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కేసును ఛేదించి ఇద్దరు మహిళల మృతికి కారణమైన ముద్దాయి అయిన ఆటో డ్రైవరు మహబూబ్ బాషను 24 గంటల లోపల పట్టుకొని 48 గంటల లోపల రేమండ్ తరలించారు. కర్నూలు మండలము, గార్గేయపురం గ్రామ పొలిమేర లోని నగరవనం సమీపంలో ఉన్న చెరువులో, కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోన కర్నూలు మండలంలోని గార్గేయపురం గ్రామ పొలిమేర లో ఉన్న నగరవనం సమీపంలో ఉన్న చెరువులో ఇద్దరి ఊరు, పేరు, చిరునామా తెలియని మహిళల మృత దేహాలు చెరువు నీటిలో బోర్లాపడి తెలియాడుతుండగా గ్రామ తలారి ద్వారా సమాచారాన్ని తెలుసుకున్న గ్రామ వీఆర్వో వెంటనే సదరు నేర స్థలాన్ని చేరుకొని శవాల ఆచూకీ కొరకు చుట్టుప్రక్కల గ్రామాలలో విచారించి ఎలాంటి సమాచారం తెలియక పోవడంతో కర్నూలు తాలూకా ఇన్స్పెక్టర్‌కు పిర్యాదు చేశారు. వివరాలలోనికి వెళితే సదరు ఇద్దరు మహిళలు అరుణ, జానకిలది తెలంగాణ రాష్ట్రం, మహబూబ్ నగర్ జిల్లా అని, వారు వేశ్య వృత్తి నిమిత్తం కర్నూలుకు కొన్ని సంవత్సరాల కిందట వలస వచ్చి కర్నూలును కేంద్రంగా చేసుకొని వారి వేశ్య వృత్తి కొనసాగించేవారు అని, ఈ క్రమంలో వారికి కర్నూలు నగరానికి చెందిన ముద్దాయి అయిన ఆటో డ్రైవరు పరిచయమైనాడని, గతంలో ఆటో డ్రైవరు కు మరియు జానకికి వచ్చిన మనస్పర్థల వల్ల జనాకీ ఆటో డ్రైవరు ను వేరే వ్యక్తుల చేత కొట్టించినదని అది మనసులో పెట్టుకొని ముద్దాయి ఆటో డ్రైవరు మహబూబ్ బాష జానకిపై కక్ష పెంచుకొని ఎలాగైనా జానకి మీద ప్రతీకారం తిచ్చుకోవాలని అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉండి, ఈ క్రమంలో 18.05.2024 తేదీన జానకి, అరుణ లు తమ బట్టలు ఉతుక్కొవడానికి గార్గేయపురం గ్రామ శివారులోని నగరవనం సమీపంలో ఉన్న చెరువు వద్దకు ముద్దాయి ఆటో లో వెళ్ళి బట్టలను ఉతుక్కొనుచుండగా అవకాశం కోసం ఎదురు చూస్తున్న ముద్దాయి జానకి ని వెనక నుండి చేరువులోనికి దొబ్బనాడని, ఈ క్రమంలో నిందితుడు నీటిలో పడిపోగా పక్కన ఉన్న అరుణ ముద్దాయిని రక్షించబోయి ఆమె కూడ నీటిలో పడిపోయినదని, నిందితుడు గట్టుకు దగ్గరలో ఉన్నందున నీటినుండి బయటకు వచ్చినాడని, అప్పటినుండి పోలీస్ వారికి కనపడకుండా తిరుగుతుండగా పోలీస్ వారు అతని కనిపెట్టి పట్టుకోని అరెస్ట్ చేసి రిమండ్‌కు పంపడమైనది.

అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

విశాలాంధ్ర - నంద్యాల: పది, ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుండి వచ్చే నెల 3వ తేదీ వరకు, ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో సంబంధిత పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్లకు డీటీలను కేటాయించాలని డిఆర్ఓను ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ ను ఆదేశించారు. 10వ తరగతికి సంబంధించి 27 పరీక్షా కేంద్రాలలో 7,748 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు కలెక్టర్ వెల్లడిస్తూ పదవ తరగతి పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9-30 గంటల నుంచి మధ్యాహ్నం 12-45 గంటల వరకు జరుగుతున్నందున సంబంధిత ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మునిసిపల్, పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సంబంధించి 8,813 మంది జనరల్ విద్యార్థులు, 537 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 9,350 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. రెండవ సంవత్సరం సంబంధించి 3,933 మంది జనరల్ విద్యార్థులు, 465 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి మొత్తం 4,398 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. మొదటి, రెండవ సంవత్సరం కలిపి మొత్తం 13,748 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ మిషన్లను మూసి వేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎ. పద్మజ, మునిసిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, డివిఈవో సునీత, డీఈవో సుధాకర్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, ఏపీఎస్ఆర్టీసీ, ఏపీఎస్పీడ సీఎల్, కార్మిక శాఖ, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

నేడు గౌతమ బుద్ధుని జయంతి వేడుకలు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : మండల కేంద్రమైనకోయిలకుంట్ల లో ది బుద్దిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశ్వనారుడు తథాగత గౌతమ బుద్ధుని 2568 సంవత్సరం జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాల యం దగ్గర రోటరీ క్లబ్ నందు వేడుకలను ఘనంగా నిర్వహించుటకు మండల బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కోవెలకుంట్ల ఆహ్వాన కమిటీ తీర్మానించడం జరిగినది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా కొమ్ము పాలెం శ్రీనివాసులు దళిత సమైక్య రాష్ట్ర అధ్యక్షులు నంద్యాల పట్టణ ప్రముఖ న్యాయవాది కే.నివాసులు ఈ కార్యక్రమానికి విచ్చేయుచున్నారు. తథాగత గౌతమ బుద్ధుని జననము జ్ఞానోదయం మరియు మరణము వైశాఖ పౌర్ణమి రోజున ఈ మూడు విశేషాలు ఒకే పౌర్ణమిలో జరిగినందున దీనికి బుద్ధ పౌర్ణమి అని చెప్పడం జరిగినది. బుద్ధుడు బోధించిన చతురార్య సత్యాలు మరియు పంచశీలాలు ఆర్య అష్టాంగ మార్గాలు గురించి వక్తలు బోధించెదరు. కావున ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ అలవర్చుకోవాలంటే బుద్ధుడు బోధించిన బోధనలే శిరోధార్యము. కావున బౌద్ధులు బౌద్ధ అభిమానులు అంబేద్కర్ ఇష్టులు ప్రజా సంఘాలు కార్మికులు మహిళలు విద్యావంతులు అందరూ పాల్గొని గౌతమ బుద్ధుడు బోధించిన మార్గములో నడుచుకుంటూ దుఃఖములేని జీవితాన్ని జీవిస్తారని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో బుద్ధుని జయంతి వేడుకల కార్యాచరణ కమిటీ సభ్యులు ఉపాసకులు రెడ్డి పల్లె ఓబయ్య నంద్యాల జిల్లా అధ్యక్షులు వడ్డే సుబ్బరాయుడు జిల్లా బీసీ సంఘం నాయకులు లాయర్ నరసింహులు సీపీఎం సుధాకర్ ప్రగతి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం గఫూర్ సార్ మహిళా సంఘం నాయకురాలు రాములమ్మ,అప్పు పోగు వెంకటసుబ్బయ్య , మద్దిలేటి తదితరులు పాల్గొని బుద్ధుని జయంతి వేడుకలను జయప్రదం చేయవలసినదిగా కోరడమైనది.

కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని పిడిఎస్‌యు జిల్లా నాయకులు మర్రి స్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక ఐఎఫ్టియు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పి.మర్రిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తుగా అడ్మిషన్లు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటనలు చేసిన ఆ ప్రకటనలను ఏమాత్రం పట్టించుకోకుండా అడ్మిషన్లు చేస్తూ నియోజకవర్గ పరిధిలో వివిధ సంస్థలకు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశార న్నారు. పలు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థకు పర్మిషన్ లేకపోయినా కూడా ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి చేశారన్నారు. ఈ నెలలో చేసుకుంటే ఒక ఫీజు జూన్ మాసంలో చేసుకుంటే ఒక ఫీజ్ అని తల్లితండ్రులకు మాయమాటలు చెప్పి కార్పొరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పూర్తి అయినాయని బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పేపర్ ప్రకటన లకు మాత్రమే పరిమితమ య్యారుతప్ప ఎక్కడ ప్రత్యక్షంగా సందర్శించిన పాపన పోలేదన్నారు. డీఈఓ, ఆర్ఐఓ తక్షణమే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలను సందర్శించి ఏవైతే అడ్మిషన్లు చేస్తున్నారో వాటి పైన చర్యలు తీసుకొని సీజ్ చేయాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని పలు కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు సెలవు దినాలలో విద్యార్థులకు మానసిక ఉల్లాసం లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులకు విద్యాసంస్థల యాజమాన్యులు భయపెడుతూ కచ్చితంగా తరగతులకు హాజరుకావాలని హుక్కుమ్ జారీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కార్పొరేట్ విద్యా సంస్థల దందా దోపిడిని అరికట్టి, తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై, ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పిడిఎస్యు ఆధ్వర్యంలో రేపటి నుంచి ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. పిడిఎస్‌యు డివిజన్ నాయకులు విక్రమ్, పవన్, నిఖిల్, శివ సతీష్ పాల్గొన్నారు.

ఇన్పుట్ సబ్సిడీ పంపిణీ చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర -మంత్రాలయం: ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బుధవారం స్థానిక ఎస్బీఐ బ్యాంకు ముందు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.విజయభాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసే ఇన్పుట్ సబ్సిడీ రైతు ఖాతాల్లో నేరుగా రైతులకు అందజేయాలన్నారు. బ్యాంక్ మేనేజర్లు పాత బకాయిలతో వాటిని పంపిణీ చేయకుండా ఖాతా నెంబర్లను, సర్వే నెంబర్లను బ్లాక్‌లో ఉంచడం సరికాదన్నారు. సంబంధిత బ్యాంక్ మేనేజర్లు రైతులకు ఏ షరతులు లేకుండా ప్రభుత్వం అందజేసిన ఇన్పుట్ సబ్సిడీని వెంటనే వారి వారి ఖాతాల్లోకి జమ చేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎస్బీఐ మేనేజర్‌కు వినతులతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నవాబ్ నూరమ్మ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గొంతు వాపు వ్యాధి నుండి పశువులను రక్షించుకోండి

విశాలాంధ్ర -అవుకు: పశువులకు గొంతు వాపు వ్యాధి టీకాను వేయించి పశువులను కాపాడుకోవాలి అని పాడి పరిశ్రమ రైతులకు మండల పశు వైద్యాధికారి డాక్టర్ భారతీదేవి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతము గొంతు వాపు వ్యాధితో పశువులు చనిపోయే ప్రమాదం ఉందని కావున తమ పశువులకు గొంతు వాపు నివారణ టీకా వేయించుకోవాలని అన్నారు. మీ పశువులను ఇంటిదగ్గర ఉంచుకోవాలని పశు వైద్య సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి పశువులకు టీకాలు వేస్తారని అన్నారు. పశువులకు వ్యాధి వచ్చిన తర్వాత నివారణకు చాలా ఇబ్బందికర పరిస్థితి ఎదురవుతాయని, ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని కావున రైతులు తమ పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని అన్నారు. మే నెలలో వర్షాలు మొదలు కావడంతో నంద్యాల జిల్లాలోని కొన్ని ప్రాంతంలో పశువులకు గొంతు వాపు వ్యాధి వలన చనిపోవడం జరిగిందని అన్నారు. కావున పశుపోషకులు పశు వైద్యశాల మరియు గ్రామీణ పశు వైద్యశాలకు వెళ్లి వైద్య సిబ్బందిని కలిసి తమ పశువులకు గొంతు వాపు నివారణ వ్యాధి టీకా వేయించుకోవాలని అన్నారు.

గ్రంధాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ

విశాలాంధ్ర - బనగాన పల్లె: శాఖ గ్రంధాలయం నందు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నందు విద్యార్థిని విద్యార్థులకు కథలు, కథానికలు, స్పోకెన్ ఇంగ్లీష్ ఇంగ్లీష్ గ్రామర్ తదితర విషయంలపై బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శివరాం విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లీష్, గణితంపై శిక్షణ ఇస్తున్నట్లు పట్టణంలో విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయాని సందర్శించి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పట్టణంలోని విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రంథాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్‌ని సంప్రదించి, తమ విద్యార్థిని విద్యార్థుల పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ఫీజు చెల్లించకుండానే సప్లిమెంటరీ పరీక్షలకు అవకాశం

విశాలాంధ్ర కొలిమిగుండ్ల: పదో తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు ఫీజు చెల్లించకుండానే సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశం ప్రభుత్వం కల్పించిందని ఎంఈఓ లు అబ్దుల్ కలాం, రాజయ్యలు తెలిపారు. బుధవారం ఎంఈఓ కార్యాలయం నందు వారు మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ నుండి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. మండల పరిధిలోని విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించకుండానే ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు పరీక్ష ఫీజు చెల్లించి గతంలో పబ్లిక్ పరీక్షలు రాయని విద్యార్థులు కూడా సప్లిమెంటరీ పరీక్షలు రాయవచ్చన్నారు. హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకుని, ఈనెల 24వ తేదీ నుండి పరీక్షలు హాజరై అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.

వైభవంగా శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి గ్రామ ఉత్సవం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండల కేంద్రమైన కోవెలకుంట్లలో శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి తిరుణాల భాగంగా ఆరు వ రోజు బుధవారం తెల్లవారుజామున శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి గ్రామ ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఉదయం 6 గంటలకు స్వామివారి పట్టణ పురవీధులలో పాండు రంగ దేవాలయం నుండి రంగరాజుపేట, మెయిన్ బజార్, సంతపేట, పురవీధులలో పాండురంగ స్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సాయంత్రం శేష వాహనంపై శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ప్రజలకు దర్శనమిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల ఆచార్యులు, సుందర ఆచార్యులు, ఆలయధర్మకర్త రాంభూపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు గడ్డం అమర్నాథరెడ్డి తెలిపారు.